నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, సోమవారం 7 అక్టోబర్ 2024 | MEDAK

## సింగూరు రెండు గేట్లు ఎత్తివేత



ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న జలాలు

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11 నంబర్ రెండు గేట్లు 1.50 మీటర్లు ఎత్తి 11026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్‌కోకు 2796 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం 14182 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 19738 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు

# పండుగ పూట పస్తులేనా..?



సంగారెడ్డి జిల్లాలో విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు

- నాలుగు నెలలుగా అతిథి అధ్యాపకులకు అందని వేతనాలు
- జిల్లాలో 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు.. 90 మంది ఉద్యోగులు
- కనీస ఉద్యోగ భద్రత లేకుండా సేవలు
- హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 6: బతుకమ్మ, దసరా,దీపావళి పండుగులు సమీపిస్తున్నా వేతనాలు రాకపోవడంతో అతిథి అధ్యాపకులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొర వేతనాలతో సేవలందిస్తున్న అతిథి అధ్యాపకులకు వచ్చే కనీస వేతనాలు సమయానికి అందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన జూన్ వేతనంతో పాటు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మొత్తం 4నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మొత్తం 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, ఆయా కళాశాలల్లో మొత్తం 90 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 34 మంది విధులు నిర్వహిస్తుండగా, పటాన్‌చెరు ప్రభుత్వ కళాశాలలో 19 మంది, నారాయణఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9 మంది, జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10 మంది, జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12 మంది, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇద్దరు అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరంతా గత జూలై మొదటి వారంలో నియామకం అయ్యారు. అప్పటికే విధుల్లో పీజీ అధ్యాపకులకు జూన్‌కు సంబంధించిన వేతనాలు విడుదల కాలేదు. ఎన్నేండ్ల అనుభవం ఉన్నా వారు ఏటా ఇంటర్వ్యూ, డెమో ఫేస్ చేయాల్సిందే. రెగ్యులర్ అధ్యాపకులు ఒక్కసారి పరీక్ష రాసి ఉద్యోగంలో చేరితే అతిథి అధ్యాపకులకు మాత్రం ఏటా వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాల్సిందే. పదేండ్లు సేవలందించినా యూజీసీ నిబంధనల పేరిట సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు వస్తే వారికే చాన్స్ ఇస్తున్నారు. పదేండ్లు సేవలందించినా గుర్తింపు ఉండడం లేదు. అసలు ఏ పరీక్ష రాయకుండానే త్రీమెన్ కమిటీ ద్వారా ఒక్కసారి ఎంపికైన కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏటా రెన్యువల్ చేస్తారు. కానీ, అతిథి అధ్యాపకులను ఏటా త్రీమెన్ కమిటీ ద్వారా నియమిస్తూ అంగట్లో సరుకులా మార్చిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ఎప్పుడో వచ్చే వేతనాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.అతిథి అధ్యాపకులు నెలకు రూ.42 వేలు, డిగ్రీ అతిథి అధ్యాపకులు నెలకు రూ.50వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. తుమ్మితే ఊడిపోయే ఉద్యోగాలుగా భావిస్తున్న అతిథి అధ్యాపకులు రోడ్డెక్కేందుకు జంకుతున్నారు. ప్రజా పాలన ప్రభుత్వానికి కనికరం వస్తుందనే ఆశతో ఇప్పటికే రాష్ట్ర మంత్రులందరికీ వినతి పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన మాట మేరకు అతిథి అధ్యాపకులు రూ. 50వేల వేతనంతో పాటు కన్సాలిడేట్ వేతనాలను ఇవ్వాలని, రెగ్యులర్ అధ్యాపకులు వచ్చే వరకు తమ ఉద్యోగాలను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక తాత్కాలిక ఉద్యోగి స్థానంలో మరొక తాత్కాలిక ఉద్యోగిని నియమించరాదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అతిథి అధ్యాపకులు మండిపడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు తాత్కాలికులైన కాంట్రాక్ట్ అధ్యాపకులు బదిలీపై వచ్చినా అతిథి అధ్యాపకులను ఇంటికి పంపించడం సరికాదంటున్నారు. ఇప్పటికే ఏడాదికి కనీసం ఆరు నెలల పూర్తి వేతనం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై మాసంలో తిరిగి విధుల్లో ఇంటర్వ్యూ ద్వారా నియామకం చేస్తే ప్రస్తుత అక్టోబర్‌లో దసరా సెలవుల కారణంగా సగం వేతనం వస్తుందని, డిసెంబర్, ఏప్రిల్ నెలలో జరిగే సెమిస్టర్ పరీక్షలకు వేతనాలుండవు, మే, జూన్ నెలలు ఖాళీ ఉండడంతో పాటు జనవరిలోనూ సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే సెలవుల కారణంగా ఆ నెల కూడా సగం వేతనమే వస్తుందని పేర్కొంటున్నారు. ఎప్పుడు ఉద్యోగం పోతుందో అనే భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు. ఇటీవల జరిగిన నియామకాల్లోనూ అదే జరిగింది. 10 ఏండ్లుగా పని చేసిన అనేక మంది డిస్టర్బ్ అయ్యారు. పీరియడ్‌కు రూ.100 నుంచి సేవలందించిన అతిథి అధ్యాపకులు, అనేక పోరాటాల తరువాత ప్రస్తుతం పీరియడ్‌కు రూ.390, నెలకు గరిష్టంగా 72 గంటలకు మాత్రమే పరిమితి ఉన్నది.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

- బతుకమ్మ ఉత్సవాలను పట్టించుకోవడం లేదు..
- మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ మరిచారు
- వందశాతం పంట రుణమాఫీ చేయాలి
- పెండింగ్ పింఛన్లు ఇవ్వాలి
- రూ4 వేలకు పింఛన్ పెంచాలి
- సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మీడియా సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్,అక్టోబర్ 6 : కేసీఆర్ మహిళలను తోబుట్టువులుగా భావించి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారని, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం మర్చిపోయిందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీని కాంగ్రెస్ నాయకులు హేళన చేశారన్నారు. బీఆర్ఎస్ సర్కార్ ఒక్క చీర ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రెండు చీరలు ఇస్తామని గొప్పలు చెప్పారన్నారు. తీరా ఇప్పుడు చీరకు బదులు రూ.500 డబ్బులు ఇస్తామని చెప్పి అవి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కేసీఆర్ బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిపించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్సవాలను విస్మరించిందన్నారు. బతుకమ్మ ఆడుకోడానికి లైట్లు ఏర్పాటు చేయలేదని, పరిశుభ్రత లేదని చాలామంది మహిళలు తమకు ఫోన్‌లు చేస్తున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వంద శాతం రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వానకాలం అయిపోతున్నా రైతుభరోసా ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ పింఛన్లతో పాటు రూ.4 వేలకు పింఛన్ పెంచి ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలన్నారు. అన్ని వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, జడ్పీ కో-ఆప్షన్ మాజీ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, నాయకులు షేక్‌హుస్సేన్, సూరారం నర్సింహులు, యాదాగౌడ్, రింగుల ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మధురం..మధురం



హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్ బస్టాండ్ ప్రాంతంలో విక్రయిస్తున్న సీతాఫలాలు

- నోరూరిస్తున్న సీతాఫలాలు
- మార్కెట్‌ను ముంచెత్తుతున్న పండ్లు
- భారీగా విక్రయాలు
- రామాయంపేట, హుస్నాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు ఎగుమతి
- ఉపాధి పొందుతున్న వందలాది మంది కూలీలు

రామాయంపేట/హుస్నాబాద్ టౌన్,అక్టోబర్ 6: నోరూరించే మధుర ఫలాలు రానే వచ్చేశాయి. సీతాఫలాల సీజన్ రావడంతో మార్కెట్‌లో జోరుగా విక్రయిస్తున్నారు. మెదక్ జిల్లా రామాయంపేట, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట గంపలు గంపలుగా విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సీతాఫలాలు విరివిగా పండాయి. తండాలు, గ్రామాలకు చెందిన గిరిజనులు, ఇతర కూలీలు అటవీ ప్రాంతాలు, గ్రామ శివారు ప్రాంతాల్లోకి వెళ్లి సీతాఫలాలు తెంపి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఒక్కో సీతాఫలం పది నుంచి ఇరవై ఐదురూపాయల వరకు ధర పలుకుతున్నాయి. పండ్ల బుట్ట వెయ్యిరూపాయల వరకు పలుకుతున్నది. సీతాఫలాల కాయల బుట్ట సైతం ఐదువందల నుంచి ఏడువందల రూపాయల దాక పలుకుతున్నది. అయినప్పటికీ మధురఫలాల్లో పోషకాలు ఉండటంతో జనం కొనుగోలు చేస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో అటవీ ప్రాంతం, గుట్టలు ఎక్కువగా ఉండటంతో సీతాఫలాలు విరివిగా అందుబాటులోకి వస్తున్నాయి. సేకరించిన పండ్లను హుస్నాబాద్ బస్‌స్టాండ్ ప్రాంతానికి తెచ్చి ఇక్కడినుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిత్యం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సీతాఫలాలకు మార్కెట్‌గా హుస్నాబాద్ బస్టాండ్ ప్రాంతం మారింది. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, నర్మెట, నంగునూర్, భీమదేవరపల్లి తదితర మండలాలనుంచి వస్తున్న సీతాఫలాలను కరీంనగర్, హుజూరాబాద్, హన్మకొండకు తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మంచి ధరలు ఉండటంతో నిత్యం ఇక్కడినుంచి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారం వేలరూపాయల్లో సాగుతుండడంతో సేకరణ కోసం వందలామంది పనిచేస్తున్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలో సీతాఫలాల విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. మెదక్ జిల్లాలోని పలు గ్రామాలతో పాటు కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి ఇక్కడికి తెచ్చి విక్రయిస్తున్నారు. రోజూ రామాయంపేట నుంచి మూడు నుంచి నాలుగు వరకు డీసీఎంలల్లో సీతాఫలాలను వ్యాపారులు మహారాష్ట్ర, కర్ణాటక,బీహార్, మధ్యప్రదేశ్, ఏపీ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. రామాయంపేటలో సీతాఫలాలు విక్రయించి ప్రతి రోజూ వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.



మెదక్ జిల్లా రామాయంపేటలో సీతాఫలాల విక్రయాలు

## రోడ్డు తవ్వారు..నిర్మాణం మరిచారు



సంగారెడ్డిలో రోడ్డు తవ్వి వరద నీళ్లను తొలిగించిన అధికారులు

సంగారెడ్డి, అక్టోబర్ 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంగారెడ్డిలోని ఎర్రకుంటపై భాగంలో ఉన్న నివాసాల్లోకి వరద చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. వరద తో ఇండ్ల నుంచి బయటికి రాలేక శ్రీచక్ర కాలనీ, రెవెన్యూ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద ముంపునకు గురైన కాలనీల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పర్యటించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన ఆదేశాలతో వరద నీటిని తొలిగించేందుకు వెంటనే పీఆర్ ఇంజినీరింగ్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో మల్కాపూర్ నుంచి రాజంపేటకు వచ్చే పీఆర్ రోడ్డును తవ్వేశారు. కానీ, తవ్విన రోడ్డును పునర్మించడానికి చర్య లు తీసుకోకపోవడంతో ఈ రోడ్డు గుండా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా యి. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో మల్కాపూర్ నుంచి రాజంపేట వయా సంగారెడ్డికి రావాలంటే ఈ రోడ్డు గుండా రవాణా చేసేవారు. కానీ, రోడ్డును తవ్వడంతో వారి ప్రయాణానికి బ్రేక్‌పడింది. వరదతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతున్నది. రాత్రి వాహనాలపై వచ్చే ప్రయాణికులు గమనించకుండా కల్వర్టు గుంతలో పడే ప్రమాదం ఉంది.

### నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం..



గతనెల 9న భారీ వర్షాలకు ఎర్రకుంట పైభాగంలో కాలనీల్లోకి వరద చేరడంతో మల్కాపూర్ నుంచి రాజంపేటకు వచ్చే పీఆర్ రోడ్డుపై కల్వర్టును జేసీబీలతో తవ్వించి నీటిని మళ్లించాం. స్లాబ్ కల్వర్టుకు రూ.48లక్షల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. మున్సిపల్ అధికారులు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసి రవాణాకు ఇబ్బందులు లేకుండా చేశారు.

– జగదీశ్వర్, పీఆర్ ఇంజినీర్, సంగారెడ్డి

## కాంగ్రెసోళ్లు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

**బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 6: గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, కేసీఆర్ గురించి మాట్లాడే నైతికహక్కు ఆ పార్టీ నాయకులకు లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ముంటే కేసీఆర్ మంజూరు చేసిన రూ.170కోట్లను వెనక్కి తీసుకొచ్చి గజ్వేల్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపులు ఉన్నాయని, నామినేటెడ్ పదవుల కోసం పాకులాడుతూ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే కేసీఆర్ చేసిన అభివృద్ధిలో గజ్వేల్‌లో ఒకశాతం అభివృద్ధి చేయించాలని డిమాండ్ చేశారు. పేదలు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు గజ్వేల్ నియోజకవర్గం ఎట్లుండే, కేసీఆర్ పాలనలో ఎట్లా మారిందని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. అనేక హామీలిచ్చి అందరినీ మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకియొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు, నాయకులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, అహ్మద్ ఉన్నారు.

## మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



సంగారెడ్డి జిల్లా కంకోల్ గ్రామ శివారులో ట్రామాకేర్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి,అక్టోబర్ 6 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని కంకోల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించే ట్రామా హెల్త్ కేర్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదన్నారు. అవసరమైన చోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధేరా చౌరస్తాకు నూతన రేషన్ దుకాణం మంజూరు చేయాలని స్థానికులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మునిపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావును మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు.



సిద్దిపేట జిల్లా కోమటి చెరువు కట్టపై గౌరమ్మను చేస్తున్న మహిళలు



సిద్దిపేట దాసాంజనేయ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



సిద్దిపేట జిల్లాలోని కోమటి చెరువుపై కోలాటం ఆడుతున్న మహిళలు

## బంగారు బతుకమ్మ ఉయ్యాలో...

సిద్దిపేట జిల్లాలో ఆదివారం అట్ల బతుకమ్మను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు, కౌన్సిలర్ కొండం కవితా సంపత్‌రెడ్డి, మహిళా కార్యకర్తలు, మహిళలు బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. సిద్దిపేట పట్టణంలో దాసాంజనేయ ఆర్యవైశ్య అసోసియేషన్ ఆధ్వర్యంలో 8 పీట్ల బతుకమ్మను ఏర్పాటు చేసి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. కోమటి చెరువుపైన పట్టణ మహిళలు బతుకమ్మ సంబురాలు నిర్వహించుకున్నారు. బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం పిండి వంటలు తిన్నారు.

–సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 6





సిద్దిపేట దాసాంజనేయ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిది పీట్ల బతుకమ్మ



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



సిద్దిపేట జిల్లా కోమటిచెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు